క్లుప్తంగా

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

చిత్తూరు అర్బన్: జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్‌లో పలువురు అధికారులను బదిలీ చేస్తూ.రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్వర్వులు జారీ చేసింది. తిరుపతి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌కు జానకిరామ్‌ను నియమించింది. ఇక ఏఈఎస్‌లుగా తిరుపతికి వాసుదేవచౌదరిని నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



దాత వితరణ చేసిన క్రీడాదుస్తులు ధరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని ఎగువ రాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం దాత బాలకృష్ణ క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అపారమైన క్రీడా ప్రతిభదాగి ఉందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను ప్రోత్సహించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. దాత బాలకృష్ణను హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో నాగరాజనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విరివిగా మండల సమాఖ్య రుణాలు



మాట్లాడుతున్న ఏపీఎం సుధారాణి

గుడిపాల: మండల సమాఖ్య ద్వారా విరివిగా రుణాలను మహిళా సంఘ సభ్యులకు అందజేయనున్నట్లు ఏపీఎం సుధారాణి అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మండల సమాఖ్య నిధి నుంచి బయోమెట్రిక్ ద్వారా ప్రతి మహిళా సభ్యురాలకు రుణాలు ఇస్తామన్నారు. మహిళా సభ్యురాలికి బ్యాంకుతో పాటు స్త్రీనిధి, విరివిగా రుణాలను ఇవ్వాలని సంఘమిత్రలను ఆదేశించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు హేమచంద్రారెడ్డి, లోకనాధరెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేస్తామని సీపీఐజిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజన్ అన్నారు. గురువారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శాఖల బలోపేతం, సభ్యత్వం పెంచడానికి నాయకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయగౌరి, కుమారి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఎమ్మెల్యే'కు ఫిర్యాదుల మోత



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ×డయల్ యువర్ ఎమ్మెల్యే¥ కార్యక్రమానికి 42 ఫిర్యాదులు అందాయి. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, మేయర్ అముదతో కలిసి ప్రజల నుంచి ఫోన్‌లో ఫిర్యాదులు స్వీకరించారు. ప్రధానంగా తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఇక నుంచి నెలకోసారి మూడు గంటల పాటు 'డయల్ యువర్ ఎమ్మెల్యే'ని నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, చిత్తూరు తహసీల్దార్ కళావతి, సహాయ కమిషనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పీఎఫ్ షెడ్యూల్ గడువు పొడిగించరూ!

- జెడ్పీ సీఈఓకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఎఫ్ షెడ్యూల్ చేసుకోవడానికి అక్టోబర్ వరకు గడువు పొడిగించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ రవికుమార్‌నాయుడును కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం 2020–2021 వరకు పీఎఫ్ ఖాతాల వివరాలు ఆన్‌లైన్ కనిపిస్తున్నాయని, 2020–2024 వరకు పీఎఫ్ షెడ్యూల్ పంపడానికి సెప్టెంబర్ 30 వరకు గడువు ఇచ్చారన్నారు. వాటిని ఇంకో నెల పొడిగిస్తే ఉద్యోగులకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, చెంగల్రాయమందడి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో 'అంతర్గత' కుదుపులు..!

- 16 మందికి స్థాన చలనం
- గతనెలలోనే రెండుసార్లు సిబ్బంది సర్దుబాటు
- తాజాగా ముగ్గురు ఆర్‌ఐలను తప్పించిన వైనం
- కొత్తగా రెవెన్యూ అధికారి–2 పోస్టు ఏర్పాటు



చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 16 మంది సిబ్బందిని ఇతర సీట్లకు మార్చు చేశారు. ఇందులో ముగ్గురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్‌ఐ)లు సైతం ఉండటం విశేషం! ఇక కొత్తగా ఓ రెవెన్యూ అధికారి (ఆర్‌ఓ) పోస్టును సృష్టించి, మరో ఉద్యోగిని అందులో కూర్చోబెట్టారు. ఈ అంతర్గత బదిలీలు చర్చనీయాంశమయ్యాయి.

బదిలీలు ఇలా..

మేనేజర్‌తో పాటు ఆర్‌ఓగా ఉన్న ఎం.గోపాలకృష్ణ వర్మ పరిధిని కుదించారు. ఇవే బాధ్యతల్లో ఈయన్ను కొనసాగించినప్పటికీ ఆర్‌ఓ–1 పేరిట పరిమితం చేశారు. సీ–1 క్లర్క్‌గా ఉన్న ఉమామహేశ్వర్‌రెడ్డికి అదనంగా రెవెన్యూ అధికారి–2 పేరిట ఓ పోస్టును సృష్టించి అప్పగించారు. పట్టణ ప్రణాళికలో ఉన్న తనూజను బీ–1, బీ–2 గుమస్తాగా నియమించారు. ఆర్‌ఐలు ఉన్న ముగ్గురు అధికారులను ఆ పోస్టుల నుంచి తప్పించారు. డి.ఆదామును ఇంజినీరింగ్ విభాగం (ఈ–1), సి.వెంకటేష్‌ను మీటింగ్ గుమస్తా, ఎస్.గోవర్ధన్‌శెట్టిని మెప్మా (హెచ్–1)కు బదిలీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న డి.అమర్‌నాథ్‌రెడ్డిని కమిషనర్ క్యాంపు క్లర్క్‌తో పాటు ఆర్‌ఐగా నియమించారు. అలాగే ఎస్.దొరైరాజ్‌ను కూడా ఆర్‌ఐగా నియమించారు. గణాంక విభాగంలో ఉన్న ఆర్.రిషితను పట్టణ ప్రణాళిక విభాగానికి, మెప్మాలో ఉన్న డి.ఆయేషాను రెవెన్యూ విభాగానికి, వాహన షెడ్డు ఇన్‌చార్జ్‌గా ఉన్న యోగ నరసింహులును సచివాలయానికి బదిలీ చేశారు. గ్యాంగ్ మజ్దూర్లుగా ఉన్న టి.కోదండన్, ఏఎస్.మునిచంద్ర, ఏసి.లోకేష్, బి.నీలవేణిని కార్యాలయ బాధ్యతల నుంచి తప్పించారు. వీళ్ల మునిసిపల్ ఇంజినీర్ వద్ద రిపోర్టు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

40 రోజుల్లో మూడోది

కాగా కార్పొరేషన్ కార్యాలయంలో 40 రోజుల వ్యవధిలో ఇవి మూడోమారు జరిగిన బదిలీలు కావడం విశేషం! గతంలో జరిగిన రెండు బదిలీల్లో కోదండన్, దొరైరాజ్‌ను ఆర్‌ఐగా నియమించారు. దొరైరాజ్ అసలు తనకు ఆర్‌ఐ పోస్టు వద్దని బాధ్యతలు స్వీకరించనకపోవడంతో ఆ పోస్టు నుంచి తప్పించారు. తాజాగా ఇతన్ని మళ్లీ ఆర్‌ఐగా కూర్చోబెట్టారు. అపుడు ఎందుకు తిరస్కరించాడో, ఇపుడు ఎందుకు ఆసక్తి చూపించాడనేది ఉద్యోగుల్లో చర్చకు తావిచ్చింది. గ్యాంగ్ మజ్దూర్‌గా ఉన్న కోదండన్‌కు ఆర్‌ఐ పోస్టును ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని కొందరు కార్యాలయ ఉద్యోగులే ఇతనిపై అప్పటి కమిషనర్‌కు ఫిర్యాదు చేసి ఆ పోస్టు నుంచి తప్పించారు. ఇక గోపాలకృష్ణ వర్మకు అడ్డుకట్ట వేయడానికే ఆర్‌ఓ–2 పోస్టును ఉమామహేశ్వర్‌రెడ్డి కోసమే సృష్టించారని ప్రచారంలోకి వచ్చింది. సీసీ పోస్టుతో పాటు ఆర్‌ఐ పోస్టును అమర్‌నాథ్‌రెడ్డికి అప్పగించడంపై కూడా చర్చకు తావిచ్చింది. ఉద్యోగుల పనితీరు, వారిపై ఉన్న ఆరోపణలపై నివేదిక తెప్పించుకున్న కొత్త కమిషనర్ తన మార్కు పాలన కోసం అంతర్గత బదిలీలు చేసినట్లు స్పష్టమవుతోంది. కార్యాలయ పరిపాలన సౌలభ్యం దృష్ట్యా రెండో ఆర్‌ఓ పోస్టు సృష్టించినట్లు తెలుస్తోంది. మరో మూడు నెలల పాటు సిబ్బంది పనితీరు పరిశీలించి ఆపై సౌలభ్యం ఆధారంగా కొందరిని బదిలీ చేయాలని కమిషనర్ నిర్ణయించుకున్నట్లు సమాచారం.

లేఔట్ ఆక్రమణకు యత్నం

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని ఇరువారం నుంచి పోతంబట్టు గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న ఐఓసీఎల్ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన లేఔట్‌ను ఆక్రమించుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని బాధితులు ధనలక్ష్మి, సునీల్‌దత్, చంద్రబాబు తమ గోడు నివేదించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఐఓసీఎల్ క్వార్టర్స్ పక్కన ఏర్పాటు చేసిన లేఔట్‌లో 2010లో 54 ప్లాట్‌లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్లాట్లు రిజిస్టర్ అయినట్లు చెప్పారు. నెల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ప్లాట్లకు దారి లేకుండా కాంపౌండ్ వాల్ నిర్మించారన్నారు. ప్లాట్‌లను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పీఆర్‌లో బదిలీలు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్(పీఆర్)శాఖలో బదిలీలు జరిగాయి. డీఈలుగా చిత్తూరుకు నవీన్, పలమనేరుకు మహేష్, పూతలపట్టుకు అనితను నియమించారు. పీఐయూ విభాగం పూతలపట్టు డీఈగా నరసింహప్రసాద్‌ను వేశారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ డీఈలుగా చిత్తూరుకు శ్రీనివాసులు, పూతలపట్టుకు రవికిరణ్, పలమనేరుకు స్టాలిన్, నగరికి శ్రీహరి, కార్వేటినగరానికి సతీష్‌ను నియమించారు.

పోషకాహారంపై అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మల

పూతలపట్టు: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అవసరమని, వారికి అధిక పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందజేయాలని సీడీపీఓ నిర్మల అన్నారు. గురువారం మండలకేంద్రంలోని సచివాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తమ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ప్రతివారం పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందించే పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను వారికి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, డీసీపీఓ ఉమాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం లోపంతోనే రక్తహీనత వస్తుందని సీడీపీఓ నిర్మల అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం వైఎస్ గేటు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు పాలు, గుడ్లు, పండ్లు, ఆకు కూరలు అధికంగా తీసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ప్రసవం అయ్యే వరకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐరాల సెక్టార్ సూపర్‌వైజర్ మంజుల, ఓఎస్‌సీ అడ్మిన్ సింధురాణి, సామాజిక కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్: పేకాటరాయుళ్లను తాలూకా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రమేష్ కథనం..నగర శివారులోని అనుపల్లె పెద్ద మొత్తంలో నగదు వెచ్చించి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. తాలూకా పోలీసులు వద్ద దాడులు చేసి పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.05 లక్షల నగదు, ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నిత్యాన్నదానానికి కూరగాయలు విరాళం



కూరగాయలు అందజేస్తున్న సత్యన్న

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని అన్నదాన ట్రస్ట్‌కు గురువారం పలమనేరుకు చెందిన సత్యన్న సుమారు 2 టన్నులు కలిగిన 12రకాల కూరగాయలను ఈవో గురుప్రసాద్ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం భేష్..!



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పూతలపట్టు: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందని తహసీల్దార్ గురప్ప కితాబిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలకు వచ్చే బియ్యపు మూటలను పరిశీలించారు. పలు సమస్యల గూర్చి ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల దుస్థితిని చూసి అధికారులతో మాట్లాడి వాటి రిపోర్టర్లను ఉన్నతాధికారులు తెలియజేయాలన్నారు. వారి వెంట అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరా హోరీగా ఎస్‌జీఎఫ్ పోటీలు



పరుగు పందెం పోటీలో బాలికలు

చిత్తూరు కలెక్టరేట్: స్థానిక మెసానికల్ మైదానంలో గురువారం ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌కు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంపిక పోటీలు హోరా హోరీగా సాగాయి. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాల బాలికలకు రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, డిస్కత్రో పోటీలు నిర్వహించారు. గురువారం షెడ్యూల్ మేరకు పోటీలు జరిగాయని, మిగిలిన పోటీలను శుక్రవారం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎస్‌జీఎఫ్ కార్య నిర్వాహక కార్యదర్శులు వసంతవాణి, వసంత, బాబు, పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



లాంగ్ జంప్ పోటీలో దూకుతున్న బాలిక

రెవెన్యూ లోటు భర్తీ చేయాలి

- విద్యుత్ చౌర్యంపై దృష్టి సారించండి
- ట్రాన్స్‌కో సీజీఎం ఆదిశేషయ్య



మాట్లాడుతున్న సీజీఎం ఆదిశేషయ్య

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో రెవెన్యూ లోటును భర్తీ చేయాల్సిన అవసరం ఉందని ఆ శాఖ క్వాలిటీ కంట్రోల్, ఎనర్జీ ఆడిట్ సీజీఎం ఆదిశేషయ్య అన్నారు. గురువారం సాయంత్రం చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయంలో డీపీఈ ఎస్ఈ శ్రీనివాస్‌బాబుతో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. తనిఖీలతో కేసులు రాసి వసూలు చేయకపోతే ఎలా? అని ప్రశ్నించారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలో రూ.26 లక్షలు చౌర్యం కేసుల నుంచి వసూళ్లు కావాల్సి ఉందన్నారు. నెలలో రెండు రోజుల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని, విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు గుర్తిస్తే జరిమానా విధించాలన్నారు. బకాయిల విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రభుత్వ శాఖలకు నోటీసులు ఇవ్వాలని ప్రైవేటు కనెక్షన్లకు సరఫరా తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈలు శేషాద్రి, ఆనంద్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

- జిల్లా సహకార శాఖ అధికారి నాగపద్మిణి



సిబ్బందితో మాట్లాడుతున్న నాగవర్ధిని

గుడిపాల: సహకార సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సహకార శాఖ అధికారి నాగపద్మిణి అన్నారు. గురువారం గుడిపాల సహకార సంఘాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రైతులకు సంబంధించి వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలు ఎంత వరకు ఇచ్చారు? రికవరీలు ఎలా ఉన్నాయి? అనే వాటిపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, స్థానిక సహకార సంఘంతోపాటు అన్ని సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఇకపై సహకార సంఘంలో ప్రతి ఒక్కటీ ఆన్‌లైన్ విధానం ఉంటుందన్నారు. సహకార సంఘంలో రూ.300 కట్టి షేర్ హోల్డర్ కలిగిన రైతులందరూ పాస్‌బుక్ జెరాక్స్, ఆధార్ కార్డ్, ఫోన్ నంబర్‌తో వచ్చి ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పూర్తి చేయాలని వారికి తెలియజేశారు. ఆ తర్వాత కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, డివిజినల్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ వనజ, డీసీఓ సూపరింటెండెంట్ బాలాజి పవార్, సీఈఓ పట్టాభి, సిబ్బంది సెల్వం, జితేంద్ర, జయరాజ్ పాల్గొన్నారు.

మొగిలి ఊరగుట్టను సర్వే చేయండి



మొగిలిలో ఊరగుట్ట భూమిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఊరగుట్ట భూమిని రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మొగిలి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 61లోని ఊరగుట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీపీఎం నాయకుడు సుబ్బారావు మాట్లాడుతూ ఊరగుట్టలో 59 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అందులో మొగిలి గ్రామానికి చెందిన 50 యానాది కుటుంబాలు ఏళ్ల తరబడి గొర్రెలు, మేకలు మేపుకుంటూ అక్కడ పండే ఫలసాయాలను విక్రయించుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఆ భూమిలో యానాదులు కొంత భాగాన్ని శ్మశానంగా ఉపయోగించుకుంటున్నారని, అయితే అదే గ్రామానికి చెందిన ఓ అగ్ర కులానికి చెందిన వ్యక్తి రెవెన్యూ అధికారులతో కలసి ఆక్రమించి, పట్టా చేసుకుని, గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఊరగుట్టలో ఆక్రమణలను నియంత్రించి ఎస్టీలకు న్యాయం చేయాలని గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు సీపీఎం విన్నవించినట్లు తెలిపారు. దాంతో డిప్యూటీ కలెక్టర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారని, కానీ స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం అక్రమార్కులకు వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు ఊరగుట్ట భూమిని సమగ్ర సర్వే చేసి కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, నాయకులు మురళి, ఓబుల్‌రాజు, వినోద్, గోపి, మంజు, యానాది సంఘ నాయకురాలు సావిత్రమ్మ పాల్గొన్నారు.

నృత్య సమ్మోహనం





కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో గురువారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను సమ్మోహితుల్ని చేశాయి. కూచిపూడి, భరతనాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే హరికథా కాలక్షేపం, భక్తి గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులను అధికారులు సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు.







సార్.. కాస్త పట్టించుకోరూ..!



కార్యాలయ ఆవరణలో విపరీతంగా పెరిగిన చెట్లు

పూతలపట్టు: ప్రభుత్వ కార్యాలయ ఆవరణల్లో ఖాళీ స్థలాలు చిన్నపాటి అడవులను తలపిస్తూ, విషసర్పాలకు నిలయాలుగా మారుతున్నాయి. పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో పక్కన ఉన్న ఖాళీ స్థలం అడవిలా మారింది. ఒక పక్క వ్యవసాయాధికారి కార్యాలయం, మరో పక్క హౌసింగ్ అధికారి కార్యాలయం ఉండగా మధ్యలో ఈ ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో విపరీతంగా చెట్లు పెరిగాయి. అదే మార్గంలోనే మండల ఉన్నతాధికారులు రోజు వెళ్తుంటారు. కానీ పట్టించుకోవడం లేదు. రైతులు, ప్రజలు వివిధ సమస్యల కోసం కార్యాలయాలకు వస్తే దోమల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు. చెట్లు విపరీతంగా పెరిగిపోవడం వల్ల చాలాసార్లు పాములు దర్శనమిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని కార్యాలయాలకు వచ్చే జనం వాపోతున్నారు. కార్యాలయాలకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయ ఆవరణలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

చిత్తూరు ఆర్డీఓగా శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు రెవెన్యూ డివిజన్ ఆర్డీఓగా ఎం.శ్రీనివాసులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రాపూర్ తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసులును చిత్తూరు ఆర్డీఓగా నియమించారు. ప్రస్తుతం చిత్తూరు ఆర్డీఓగా పనిచేస్తున్న చిన్నయ్యను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.